తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి
మంగళవారం 12 మే 2026
పేజీలు : 8
Follow :

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలి

### కలెక్టర్ అనురాగ్ జయంతి

**మోటకొండూరు,మే 11,(జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం మోట కొండూరు మండలం దిలావర్ పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయనీ, అవి ఏ దశలల్లో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తి అయినంత వరకు లబ్ధిదారుల అకౌంట్ లలో బిల్లులు పడుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలన్నారు. మంజూరైన ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.ఇప్పటికే నిర్మాణం చివరి దశకు చేరుకున్న ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని



సంబంధిత అధికారులకు తెలిపారు.లబ్ధిదారులు నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బండరాయితో మోది వ్యక్తి దారుణహత్య

### మద్యం మత్తులో ఘర్షణ



**బూర్గంపహాడ్ మే 11 (జనంసాక్షి):** మద్యం మత్తులో ఘర్షణ జరిగి బండరాయితో మోది వ్యక్తిని దారుణంగా హత్యచేసిన ఘటన బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం లారీ యార్డు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రం నవాద జిల్లాకు చెందిన కుందన్ సింగ్ (45) గత కొంతకాలంగా మండల పరిధిలోని లక్ష్మీపురంలో లారీ కమాన్ కట్టల మేస్త్రిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో తనతో పాటు పనిచేసే ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో వారి మధ్య మాటమాట పెరగడంతో ఘర్షణకు దారితీసింది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన అతని స్నేహితుల్లో ఒకరు కుందన్సింగ్ పై బండరాయితో దాడి చేయడంతో ఘటనా స్థలంలోనే మరణించాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్సై మేడా ప్రసాద్ సోమవారం ఉదయం లక్ష్మీపురంలో ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ను పిలిపించి హత్య జరిగిన ప్రదేశంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో జరిగిన ఘర్షణ కారణంగానే వ్యక్తిని హతమార్చారా... లేదా వారి మధ్య ఏమైనా పాతకక్షలు ఉన్నాయా... అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా ఈ ఘటనకు కారణమైన ఇద్దరు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. హత్య కేసుకు సంబంధించి పాల్వంచ సీఐ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

### బిక్కుమల్ల గ్రామపంచాయతీ రికార్డులు

### నర్సరీ పరిశీలన

**నూతనకల్ మే11(జనంసాక్షి)** మండల పరిధిలోని బికమళ్ళ గ్రామపంచాయతీని ఎంపీడీవో సునీత ఆకస్మిక తనిఖీ చేశారు సోమవారం ఆమె గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు అనంతరం పంచాయతీ కార్యదర్శిని గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు గ్రామంలో నర్సరీని పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా నిరంతరం నీరు అందించాలని పశువులు మేకలు గొర్రెల నుండి మొక్కలను రక్షించాలని షెడ్ నెట్ లేని మొక్కలకు నెట్ కల్పించాలని పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు ఉపాధి హామీ ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు గ్రామంలో మగ్గాలు నడుపుతూ జీవనం నడుపుతున్న 40 కుటుంబాలకు సామాజిక మరుగుదొడ్లు కావాలి అని పిడి డిఆర్డిఏకు వినతి పత్రం ఇచ్చినందున పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమేష్ ఫీల్డ్ అసిస్టెంట్ గీత ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో జల, ప్రకృతి సంరక్షణ

### జల్ సంచయ్ -జన్ భాగీదారీ"ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్

### ప్రజా చైతన్య కార్యక్రమానికి శ్రీకారం

**దేవరకొండ, మే 11 (జనంసాక్షి )** మన భవిష్యత్తు తరాలు మనల్ని అంచనా వేసేందుకు ఉపయోగించే మొదటి కొలమానం నీరు అని,నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మునిసిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వేంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలని అన్నారు. జల్ సంచయ్ జన బాగిదారి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని సోమవారం జండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రజలలో ఈ విషయమై అవగాహన కల్పించేందుకు గాను ఏర్పాటు చేసిన ప్రచార వాహనం అన్ని గ్రామాలను సందర్శిస్తుందని, తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారుల ద్వారా నీటి సంరక్షణ, నీటి పొదుపు ,ఉన్న నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలో వాటికి సంబంధించిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు,నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్లు, వ్యక్తిగత సోక్ పిట్లు, నీటిని వృద్ధిపరిచేందుకు తోడ్పడే ఫామ్ పాండ్స్ ,నీటి సంరక్షణ కట్టడాలపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళు_న్నట్లు చెప్పారు. ప్రజలందరూ నీటిని పొదుపుగా



వాడుకోవాలని, నీటి వనరులను సంరక్షించుకోవాలని, నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములై సహకరించాలని కోరారు. అదేవిధంగా వర్షపు నీటిని సంరక్షించుకోవడం చాలా ముఖ్యమని, నీటిని పొదుపుగా వాడుకుంటే వచ్చే తరాల వారికి నీటి కొరత లేకుండా చూడవచ్చని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, భావితరాలను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, మున్సిపల్ పరిధిలో ఇల్లు నిర్మించుకునే వారికి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకునేలా చూస్తామని, నీటి సంరక్షణ చర్యలపై కార్పొరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇట్టి కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ రామదుర్గా రెడ్డి, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎం పి డి ఓ డ్యానియెల్, డిఆర్డిఏ అధికారులు ,కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం,ఏపీవో, ఏపీఎంలు,సీసీలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచే పొగళ్లపల్లి పల్లె వెలుగు

## సర్వీస్ ప్రారంభం

- ప్రారంభించనున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ
- ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర



**ములకలపల్లి మే 12 జనంసాక్షి:** మండలంలోని పొగళ్ళపల్లి, తిమ్మంపేట గ్రామాలను కలుపుతూ పల్లె వెలుగు సర్వీస్ మంగళవారం నాడు ఎమ్మెల్యే ఆదినారాయణ చేతుల మీదుగా లాంచనంగా ప్రారంభించబడుతుంది. దీంతో ఆ ప్రాంతవాసుల ఎన్నో సంవత్సరాల కల నెరవేరినట్లు అవుతుంది. సత్తుపల్లి నుండి పట్వారి గూడెం, ములకలపల్లి, వెంకటాపురం, బూర్గంపాడు ద్వారా భద్రాచలం వెళ్లే పల్లె వెలుగు నూతన బస్సు సర్వీసును ములకలపల్లి లో మంగళవారం నాడు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. అదేవిధంగా మరొక సర్వీస్ అయిన సత్తుపల్లి నుండి జగన్నాధపురం వెళ్లే పల్లె వెలుగు సర్వీస్ మార్గమధ్యంలో ఉన్న జగ్గారం గ్రామానికి రాత్రివేళ, ఉదయం ఒక్కో ట్రిప్పు నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సుల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఈ సందర్భంగా కోరారు.

## ప్రమాదకర విద్యుత్ తీగలను వెంటనే తొలగించాలి

### సైడ్ ఆరమ్‌ల ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలి : కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్



**భువనగిరి, మే 11 (జనం సాక్షి)** భువనగిరి పట్టణ 22వ వార్డు పరిధిలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు, విద్యుత్ స్థంభాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరానగర్ ప్రాంతంలో ఎర్ర సతీష్ ఇంటి సమీపం నుంచి బర్రె లక్ష్మి ఇంటి వరకు విద్యుత్ తీగలు ఇండ్లను ఆనుకుని అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్నాయని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున వెంటనే సైడ్ ఆరమ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను ముందుకు జరపాలని డిమాండ్ చేశారు.అలాగే న్యూ రామ్‌నగర్ ప్రాంతంలో కట్టమైసమ్మ బ్రహ్మాచారి ఇంటి వద్ద ఉన్న 11 కేవీ విద్యుత్ స్థంభం ఇంటికి అడ్డంగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఆ విద్యుత్ స్థంభాన్ని తొలగించి రోడ్డు పక్కన ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన విద్యుత్ సమస్యలను అధికారులు అత్యవసరంగా గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ విజ్ఞప్తి చేశారు.

### ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లో పాల్గొని పట్టు బట్టలు అందజేసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**యాదగిరిగుట్ట మే 11 (జనంసాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని నాల్గవ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన దుబాకి స్వప్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆప్యాయంగా అభినందించి, పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**మాతృ నాయక్, మండల విద్యాధికారి దేవరకొండ**



**దేవరకొండ,మే 10 (జనంసాక్షి)**
ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో కూడా అభివృద్ధి చెందుతున్నాయని దేవరకొండ ఎంఈఓ మాతృనాయక్ తెలిపారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉన్నత వర్గాలకు మాత్రమే పరిమితమైన సమ్మర్ క్యాంపు లను ప్రభుత్వ పాఠశాలలో కూడా నిర్వహించడం ద్వారా బడుగు,బలహీనవర్గాల విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని కోరారు. ఎండాకాలంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చేరుపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్ రెడ్డి,లోక్య నాయక్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గుండెపోటుకు గురై పంగ కృష్ణయ్య మృతి

- ○ కృష్ణయ్య కుటుంబానికి కాంగ్రెస్ శ్రేణుల చేయూత
- ○ మృతుడి కుటుంబానికి 90,000 ఆర్థిక సాయం



**మర్రిగూడ, మే 11 (జనంసాక్షి)**
మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన పంగ కృష్ణయ్య అనారోగ్యంతో గుండెపోటుకు గురై ఇటీవల మృతి చెందారు. ముగ్గురు కూతుర్లకు తండ్రి దూరమవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కొన్ని నెలల క్రితమే కృష్ణయ్య మోకాలి శస్త్రచికిత్స చేయించుకుని ఆర్థికంగా చితికిపోయారు. ఆ విషాదం నుంచి కోలుకోకముందే కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య అలివేలు, ముగ్గురు కుమార్తెల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. విషయం తెలుసుకున్న మర్రిగూడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు రామదాసు శ్రీనివాస్, కాంటెస్టెడ్ సర్పంచ్ పులిమామిడి నర్సింహా రెడ్డి స్థానిక నాయకులతో కలిసి సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, పార్థివదేహానికి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు, కాంగ్రెస్ నాయకులు కలిసి మానవతా దృక్పథంతో మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. రామదాసు శ్రీనివాస్, పులిమామిడి నరసింహారెడ్డి, జమ్ముల వెంకటేష్, ఏడుదొడ్ల కృష్ణారెడ్డి, నిమ్మరాసు రమేష్, వల్లంల వెంకటయ్య, వల్లంల శ్రీశైలం, సిల్వేర్ యాదయ్య, తదితరుల సహకారంతో 90,000 ఆర్థిక సాయాన్ని సేకరించి మృతుడి భార్య అలివేలుకు అందజేశారు. "కష్టకాలంలో ఒకరికి ఒకరం అండగా ఉండటం మన బాధ్యత. చిన్నారుల చదువులకు భవిష్యత్తులో కూడా అండగా ఉంటాం" అని గ్రామ పెద్దలు భరోసా ఇచ్చారు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపగా, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు చూపిన మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలిచింది. సాయం అందించిన వారందరికీ మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలి

**ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్**

**చౌటుప్పల్, మే 11 (జనంసాక్షి)**
ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించు కోవాలని ఇ ఎల్ వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని స్వాములవారి లింగోటం, పంతంగి గ్రామాల్లోని పలు దేవాలయాలను సోమవారం సందర్శించారు. దేవాలయాల అభివృద్ధి పనులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ స్వాములవారి లింగోటం గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ఫౌండేషన్ తరపున అందజేస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. పంతంగి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం,శ్రీ ముత్యాలమ్మ దేవాలయాలకు వచ్చే భక్తులు ఎండకు, వానకు ఇబ్బంది పడకుండా ఉండేలా షెడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణాలకు పెయింటింగ్ వేయించి, దేవాలయాలకు కొత్త కళ వచ్చేలా చూస్తామని తెలిపారు. ధార్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ భాస్కర్‌కు ఆయా గ్రామాల ప్రజలు, రజక సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి,ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.



## తేట్టకుంట బాటను అభివృద్ధి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేత

**మాడుగులపల్లి, మే 11 (జనంసాక్షి):**
మండల పరిధిలోని గంద్రవానిగూడెం గ్రామ రైతులు తమ సాగు భూములకు వెళ్లే దారిని పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు గ్రామంలోని సుమారు 400ఎకరాల వ్యవసాయ భూమికి వెళ్లే ప్రధాన మార్గమైన తేట్టకుంట బాట ప్రస్తుతం అత్యంత అధ్వాన్నంగా తయారైందని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు పొలాల వద్దకు, బావుల దగ్గరికి వెళ్లవలసిన ఈ బాటలో భారీగా గుంతలు పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు వెళ్లడానికి వీలు లేకుండా పోయిందని, దీంతో సాగు పనులు భారంగా మారుతున్నాయని వివరించారు. తక్షణమే స్పందించి తేట్టకుంట బాటలోని గుంతలను పూడ్చి, ట్రాక్టర్లు సాఫీగా వెళ్లేలా బాటను అభివృద్ధి చేయాలని రైతులు కోరారు వినతి పత్రం అందుకున్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే బాట మరమ్మతులు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు మాజీ సర్పంచ్ చింతకుంట్ల శ్రీనివాస్,నరేష్, నాగరాజు, మహేందర్, శేఖర్, రవి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యాలయంకు రక్షణ గోడ ఇతర మౌలిక సదుపాయాల పనులకు శంకుస్థాపన

**పాలక వీడు (జనంసాక్షి) :**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే నెల 10 నుంచి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలను సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలలో భాగంగా సోమవారం పాలకవీడు మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయం నందు రాష్ట్ర మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో 87 లక్షల రూపాయల నాబార్డ్ నిధులతో కేజీబీవీ రక్షణ గోడ, ఇతర మౌలిక సదుపాయాలకు పాలకవీడు మండల సర్పంచ్ పల్లి సుజాత కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్ వి సుబ్బారావు,డిసిసి ప్రధాన కార్యదర్శి మోతిలాల్, మాజీ ఎంపీపీ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నరసింహారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి జితేందర్ రెడ్డి,ఎంపీడీవో లక్ష్మి, ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ, ఇంజమూరి కాటయ్య, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన బీఆర్ఎస్ గళం

- ○తూకం దోపిడీ ఆపకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తాం
- ○తూకం పేరిట రైతులను దోచుకుంటున్న రైస్ మిల్లుల యాజమాన్యాలు
- ○బస్తాకు రూపాయి వసూలు చేస్తున్న లారీ కాంటా వ్యవస్థపై విమర్శలు
- ○సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- ○వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని డిమాండ్
- ○నెల రోజులుగా ధాన్యం కొనుగోలు కాక రైతుల ఆవేదన
- ○మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి, మే 11 (జనంసాక్షి):**
రైతుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ తమ పోరాటం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రేవనపల్లి, మండలం లోని గోస్కొండ, భీమనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కాంటా వేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆలస్యం తో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. తూకం పేరిట 42 కిలోల ధాన్యం బస్తాలను కాంటా వేస్తూ రైతుల కష్టాన్ని రైస్ మిల్లుల యాజమాన్యాలు దోచుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లారీల కాంటా పేరిట బస్తాకు రూపాయి చొప్పున వసూలు చేస్తున్నప్పటికీ సివిల్ సప్లై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న లారీ సమస్యతో పాటు రైస్ మిల్లుల యాజమాన్యాల వైఖరిని మార్చాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి వేగవంతంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని, లేదంటే పార్టీ రాష్ట్ర కమిటీ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి కెసిఆర్, కేటీఆర్ నాయకత్వంలో హైవే దిగ్బంధం కార్యక్రమానికి భారత రాష్ట్ర సమితి సిద్ధంగా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిలువేరు బాలనరసింహ, వార్డ్ కౌన్సిలర్ బాత్క లింగస్వామి, నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, చింతకింది కిరణ్, సీత శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



# కేవైసీ పేరుతో కూలీల కుదింపుకు కుట్ర

## ఉపాధీ కూలీల ఈకేవైసీ గడువు పెంచాలి

**కారేపల్లి, మే11(జనంసాక్షి):**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధీ కూలీలకు కేవైసీ పేరుతో కూలీల సంఖ్య కుదింపు కు కుట్ర చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం మాణిక్యారంలో ఉపాధి పని ప్రాంతాన్ని వ్యకాస నాయకులు సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈసందర్భంగా వ్యకాస నేత నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధీ కూలీలు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని గడువు పెట్టిందని గడవు 11వ తేదితో ముగిసిందన్నారు. ఈ కేవైసీ ప్రాధాన్యత తెలియక చాలా మంది కూలీలు కేవైసీ చేయించుకేలేదన్నారు. రాష్ట్రం వ్యాప్తం కేవైసీ చేయించుకోని వారి సంఖ్య 3 లక్షల పైగా ఉందన్నారు. వారందరు నష్టపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వం కేవైసీ గడువు పెంచటంతో పాటు కేవైసీ ప్రాధాన్యతనపై చైతన్యం చేయాలన్నారు. రోజు వారి కూలీ రూ.307 ఇవాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా పడటం లేదన్నారు. పని ప్రదేశాలలో టెంట్, నీరు, మెడికల్ కిట్స్ కల్పించటం లేదన్నారు. కూలీలకు ప్రమాధ భీమా కేంద్రం ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్లతో ఈనెల 15న గ్రామీణ బంద్‌లో భాగంగా ఉపాధి బంద్, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధీ కూలీలు హక్కులు, పని దినాలు, కూలి పెరగాలంటే పోరాటాలకు మద్దతు తెల్పాలని కోరారు. ఈసంధర్భంగా కరపత్రాలను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కే.ఉమావతి వ్యకాస నాయకుల పీ.నాగేశ్వరరావు, గోపాలు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# హాలియాలో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**హాలియా, మే 11 జనంసాక్షి :**



ప్రభుత్వ ఆదేశాల మేరకు హాలియా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హాలియా మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు రాజా రమేష్ యాదవ్ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి ముచ్చర్ల శ్రీనయ్య మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తి మాట్లాడుతూ శిబిరంలో ప్రతిరోజు విద్యార్థులకు ఆటలు, పాటలు, యోగాభ్యాసం, ధ్యానం, అల్లికలు, కుట్లు, నృత్య కార్యక్రమాలు, కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే శిబిరంలో పాల్గొనే ప్రతి విద్యార్థికి అల్పాహారం అందజేస్తున్నట్లు చెప్పారు.ఈ శిబిరం ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందని, పాఠశాల విద్యార్థులతో పాటు పట్టణంలోని ఇతర విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా ధ్వజస్తంభ, గ్రామదేవతల ప్రతిష్ట

## అన్నదానం ప్రారంభించిన అజ్మీర వీరన్న

**కారేపల్లి, మే11(జనంసాక్షి) :**



కారేపల్లి మండలం బీక్యాతండాలోని రామాలయం ధ్వజస్తంభం, గ్రామదేవతల ప్రతిష్ట ఉత్సవాలు గ్రామ పెద్దలు అజ్మీర బిచ్చు నాయక్, వాంకుడోత్ రాములు ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ, చండీ రుద్రహోమాలు, మహాలక్ష్మి హోమాలు, సహస్ర కుంకుమార్చన జలాధివాస, క్షీరాదివాస, ధాన్యాదివాస, పుష్పాదివాస, సయ్యాధివాసా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు బి వాసుదేవ శర్మ, బి.భరద్వాజ శర్మ, ఎన్.నాగేంద్రశర్మ, రోహిత్‌శర్మల తోపాటు పలువురు పూజారులు ఈ కార్యక్రమంలో పాల్గన్నారు. గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ట అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న ప్రారంభించారు.



# జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించడం గర్వకారణం - కళాశాల ప్రిన్సిపల్

**బూర్గంపహాడ్ మే 11 (జనంసాక్షి)**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- జిల్లాలో బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించటం గర్వకారణం అని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చీన్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన విద్యా వారోత్సవాలు సందర్భంగా బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐపీఎస్ ఎస్/ ఐ డి పి ఎస్ ప్యానెల్స్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. అనంతరం విద్యా ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పాంప్లెట్లు, బ్రోచర్లు, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్చి?2026 ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలలో జిల్లాలో బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందిస్తూ, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం కూడా కళాశాల విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. విశాలమైన క్రీడా ప్రాంగణం, ఆధునిక వసతులతో కూడిన ప్రయోగశాలలు, గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదనంగా ఐ టి సి సంస్థ అందించిన త్రాగునీటి ఫ్రిజ్ సహకారంతో విద్యార్థులకు స్వచ్ఛమైన చల్లటి త్రాగునీరు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, భద్రత, మెరుగైన విద్యా వాతావరణం కోసం కళాశాలలో సీసీటీవీ పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు అధ్యాపకులు సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ డ్రైవ్‌ను మరింత ప్రభావవంతంగా నిర్వహించాలని సూచిస్తూ, కళాశాలలో ఉన్న విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు గురించి గ్రామీణ స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించి, అధిక సంఖ్యలో అడ్మిషన్‌లు సాధించి జిల్లా స్థాయిలో ముందువరుసలో నిలవాలని అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలలో భాగంగా సైన్స్ ల్యాబ్ ప్రారంభం

**నేరేడుచర్ల (జనంసాక్షి ):**



పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు విద్యా వారోత్సవాల మొదటి రోజున పాఠశాలలో నూతనంగా నిర్మించిన"సైన్స్ ల్యాబ్"ను ముఖ్యఅతిథిగా హాజరైన నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాల సమ్మర్ క్యాంపు నందు తమ వాయిద్య పరికరాలతో సంగీత విభావరిని నిర్వహిస్తున్న వర్ధమాన కళాకారులు సుచిర్, అక్షిత్ లను అతిధులుగా హాజరైన మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగరాజు,ఎంపీడీవో శ్యామ్ సుందర్ రెడ్డి ఎంఈఓ ఎం బాలు మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి స్థానిక కౌన్సిలర్లు ఇంజమూరి శ్రీకాంత్,యారవ లక్ష్మి మత్స్యశాఖ అధ్యక్షులు యామిని వీరయ్యలతో కలిసి శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని సద్వినియోగ పరుచుకునేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. విద్యార్థుల సృజనను వెలికితీయుటకు, సహపాఠ్య కార్యక్రమాల నిర్వహణకు సమ్మర్ క్యాంపులు ఎంతో తోడ్పడతాయని విద్యార్థు లందరూ సద్వినియోగ పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంసైదులు, జానకిరాములు, నాగమణి, యాదగిరి బాలు వై జానయ్య, బికోజి ,జి నాగేష్ ,ఆర్ రాజు, సరస్వతి, సరిత ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



### ఘనంగా కునపురి రాములు వర్ధంతి

**వలిగొండ, మే 11 (జనం సాక్షి )**

మండలంలోని దాసిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు నేత,బిఆర్ఎస్ నాయకులు కునపురి రాములు వర్ధంతిని స్వగ్రామంలో కుటుంబ సభ్యులు,బి ఆర్ఎస్ నాయకులు, అభిమానులు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. రాములు స్థూపానికి పలువురు పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపోలు గోపి ,కొమురెల్లి సంజీవరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పై ఉచితంగా

# నైపుణ్య శిక్షణ తరగతులు

**యాదాద్రి, కరస్పాండెంట్ మే 11 (జనంసాక్షి)**

యాదాద్రి జిల్లాలోని యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించుటకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం మరియు టీం సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భువనగిరి నందు (కొత్త బస్ స్టాండ్ ఎదురుగా) 12 రోజుల పాటు నిపుణులచే సర్టిఫికేట్ తో కూడిన నైపుణ్య శిక్షణ తరగతులు ఉచితముగా నిర్వహించడం జరుగుతుందని దీనిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎంప్లాయిమెంట్ అసిస్టెంట్ (మెంబర్ సెక్రటరీ టీం) తెలియజేశారు. శిక్షణలో పాల్గొన్న యువతీ, యువకులకు శిక్షణ ఆనంతరము జాబ్ మేళ నిర్వహించి ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు ఏదైనా డిగ్రీ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన 18 నుండి 40 సంవత్సరాలు లోపు గల యువతీ, యువకులు తమ బయోడేటా లేదా రెస్యూమ్ తో పాటు, విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, రూమ్ నెంబర్ ఎఫ్ 8, మొదటి అంతస్థు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయములో న్యూ కలక్టరేట్, యాదాద్రి భువనగిరి జిల్లా నందు గల టీం కార్యాలయం నందు ఈనెల 12 నుండి 16 వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

# అట్టహాసంగా మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ కుమారుడు జగదీష్ వివాహ రిసెప్షన్ వేడుకలు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

**కల్లూరు మే 11(జనంసాక్షి)**

కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, మణి దంపతుల కుమారుడు జగదీష్, వధువు మెహర్ హర్షిత వివాహ రిసెప్షన్ వేడుకలు సోమవారం కల్లూరు లోని వీకేఆర్ ఫంక్షన్ హాల్ లో అట్టహాసంగా జరిగాయి. వివాహ రిసెప్షన్ వేడుకలకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజాదేవి, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజశేఖర్ , ఎంపీడీవో చంద్రశేఖర్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నవ్య కాంత్ , స్థానిక ఎస్సై డి హరిత, పుర ప్రముఖులు లంక్క అప్పలనాయుడు, పగడాల లచ్చిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చంద్రరావు పొట్రూఅర్జున్ రావు, భాగం ప్రభాకర్ చౌదరి, బొల్లం రామారావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, బొల్లం శంకర్ గౌడ్, రాహుల్ ప్రియాంక గాంధీ సేన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హబీబ్, కర్నాటి అప్పి రెడ్డి, నోటి కృష్ణారెడ్డి, దోసపాటి భాస్కరరావు, దోసపాటి శ్రీనివాసరావు, కళ్యాణపు వెంకటేశ్వరరావు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శ్రీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, భుక్యారాంబాయి ,దాసరి సుధారాణి, ఖమ్మంపాటి రాధా, యాస నాగమణి శ్రీకాంత్, పలువురు పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధువులు స్నేహితులు శ్రేయోభిలాషులు పలువురు ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.



# ఈ ని సస్పెండ్ చేయాలి

## సర్పంచ్ మడకం విజయ

- పైసలు లేకుంటే ఫోటో నో అప్లోడ్
- కలెక్టర్ ను కలవనున్న సర్పంచ్



**ములకలపల్లి మే 11 జనంసాక్షి :** మండలం లోని ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు పరిస్థితి దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారిందని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకురాలు, రాచన్నగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ మడకం విజయ ఆరోపించారు. ఆదివారం రాచన్నగూడెం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకోవడం కోసం ఇందిరమ్మ లబ్ధిదారులు తమ ఇండ్లను అప్పో సొప్పో చేసి కట్టుకుంటున్నారని, వాటిలో చాలా వరకు స్లాబ్ లు పడగా,మరికొన్ని స్లాబ్ దశలో ఉన్నాయన్నారు. గత నెల రోజులుగా హౌసింగ్ ఏఈ మండలానికి అందుబాటులో ఉండటం లేదని, లబ్ధిదారులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ఏఈ నిర్వాకం వల్ల బిల్లు ఆలస్యం జరుగు తున్నాయని లబ్ధి దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఈ ఇంటికి అయిదు నుండి పదివేల వరకు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇచ్చిన వాళ్ళ ఫోటోలు మాత్రమే తీస్తూ లంచం ఇవ్వని లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయం పై సోమవారం జిల్లా కలెక్టర్ ను కలిసి మండలంలో వున్నా ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు వివరిస్తామని ఆమె అన్నారు.

# బండి సంజయ్ కుమారుడి పై చర్యలు తీసుకోవాలి



**ఖమ్మం, మే 11, (జనంసాక్షి)**

మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శులు గొర్రెపాటి రమేష్, వై. జానకి, మస్తాన్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ, హైదరాబాద్లో పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసు అత్యంత ఘోరమైనదని పేర్కొన్నారు. మైనర్ బాలికపై జరిగిన దారుణానికి పాల్పడిన వారిపై రాజకీయ ప్రభావం లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరగాలంటే కేసును వేగంగా విచారించి, నిందితులకు గరిష్ఠ శిక్ష విధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తుల కుటుంబ సభ్యులు అయినప్పటికీ చట్టం ముందు అందరూ సమానమేనని, దర్యాప్తు పారదర్శకంగా మరియు ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా జరగాలని కోరారు. ఈ కేసును ప్రత్యేక న్యాయస్థానంలో విచారించి, బాధిత బాలిక వాంగ్మూలాన్ని స్వయంగా న్యాయమూర్తి నమోదు చేసి త్వరితగతిన తీర్పు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బాధితురాలికి ప్రభుత్వం పూర్తి రక్షణ, వైద్య సహాయం, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ ఘటనను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా యువజన, మహిళా సంఘాలు నిరసన కార్యక్రమాలకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. నిందితులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు.

# బండి సాయి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

**ఖమ్మం, మే 11, (జనంసాక్షి) :**



మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఖమ్మంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ మాట్లాడుతూ, చట్టం ముందు అందరూ సమానులేనని, రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. మైనర్ బాలిక ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పటికీ గంటల తరబడి నిరీక్షింపజేయడం బాధాకరమన్నారు. కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు బండి సాయి భగీరథ్‌ను అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ మహిళల భద్రతపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు, అత్యాచార ఘటనల్లో నిందితులకు రాజకీయ అండదండలు ఉండకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ బేగం, జిల్లా కమిటీ సభ్యులు అజిత, అమరావతి కుమారి, బీబీ మంగా, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కూచిపూడి నరేష్, జిల్లా కమిటీ సభ్యులు యాట రాజేష్, రెడ్డి, సునీల్, జిల్లా నాయకులు రాజేష్, ఉపేందర్, గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు త్రినాథ్, జిల్లా కమిటీ సభ్యులు భాను, శ్రీకర్, సుశాంత్, రాగిణి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు

# యడవల్లి వల్లబ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నిడమనూరు మే 11 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు యడవల్లి వల్లబు రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం వారి నివాసం లొ శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ శ్రీనివాస్ రెడ్డి, ఊట్కూరు మాజీ సర్పంచ్ నర్సింగ్ విజయ్ కుమార్, ముప్పారం శివాలయం చైర్మన్ శెట్టి వీరేశం, నిడమనూరు మండల యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలంపల్లి నరేష్, ముప్పారం ఫస్ట్ వార్డ్ నెంబర్ కుంచం రాంబాబు, కాంగ్రెస్ పార్టీ ముప్పారం సీనియర్ నాయకులు గణపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 7వ డివిజన్ డబుల్ బెడ్ రూం క్వార్టర్స్ నీటి సమస్యపై ధర్నా

**ఖమ్మం, (జనంసాక్షి) :**



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 7 వ డివిజన్ టేకులపల్లి డబుల్ బెడ్ క్వార్టర్స్ ప్రజలకు గత కొంత కాలంగా మంచి నీటి సరఫరా సరిగా కావడం లేదు అని, వెంటనే ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఖానాపూరం హవేలీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం వద్ద బాధితులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా ను ఉద్దేశించి ఖమ్మం డివిజన్ సిపిఎం పార్టీ కార్యదర్శి వై విక్రమ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు లు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం క్వార్టర్స్ లో 1200 వందల కుటుంబాలు నివాసం వుంటున్నారు అని వారికి కనీసం త్రాగు నీరు సమస్య పరిష్కారం చేయలేకపోయారు అని విమర్శించారు. రెండు మూడు రోజులకు ఒకసారి అదీ కూడా అర్ధ గంట కూడా నీళ్లు ఇవ్వలేక పోతున్నారు అని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో కనీసం ప్రజలు తాగడానికి కూడా నీళ్లు లేవని అన్నారు . చాలా రోజుల నుంచి నీళ్ల సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు గాని అట్లాగే కార్పొరేషన్ అధికారులు కూడా పట్టించుకోవట్లేదు అని విమర్శించారు నిత్యవసరంలో భాగంగా నీళ్లు కూడా ముఖ్యం అని అలాంటి సౌకర్యాన్ని అందించడంలో ఖమ్మం కార్పొరేషన్ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. అక్కడ 1200 కుటుంబాలు వున్నా కనీసం వాళ్లకు మౌలిక వసతులు లేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు . మరోవైపు మంచినీళ్ల ట్యాంకులు కూడా శుభ్రం లేక వచ్చే నీళ్లు మురికిగా రావడంతో ప్రజలు అనేక జబ్బులతో ఇబ్బంది పడుతున్నారని వెంటనే మంచి నీళ్ల ట్యాంకులు శుభ్రం చేపించి డ్రైనేజీ సమస్య కూడా పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ లో జూప్రహ ఆరోగ్య కేంద్రం కూడా మూసి వేశారు అని ఆరోపించారు. తక్షణమే కమిషనర్ ఈ ప్రాంత సమస్యపై దృష్టి సారించాలి అని వారు డిమాండ్ చేశారు. ప్రధానంగా ఇక్కడ ప్రజలు ఖమ్మం బైపాస్ రోడ్ కు రావాలంటే టేకులపల్లి బ్రిడ్జి మీదుగా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది అని, ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్ రూం క్వార్టర్స్ నుంచి డైరెక్ట్ గా బైపాస్ రోడ్ దారి తీసి సాగర్ కాల్వపై నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 7వ డివిజన్ సమస్యలపై కమిషనర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారి ఇఇ ని వెంటనే పంపి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఓం జబ్బర్ , ఎస్కే మీరా, ఎస్ నవీన్ రెడ్డి, నాయకులు ఎస్కే నాగుల మీరా , బోడపట్ల సుదర్శన్, జె వెంకన్న బాబు, పోతురాజు వెంకట్ , కత్తుల అమరావతి, చిలకల వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి శీను తోట నాగరాజు, కుర్రి వెంకటస్వామి, కారుమంచి పవన్, నాయిని మురళి, సీనియర్ నాయకులు ధనియాకుల నాగేశ్వరావు, పెద్ది నాగయ్య వేదగిరి మురళి , గాలి రాంబాబు, ఎస్కే మునీర్, ఎస్.కె నాగుల్ మీరా , గొర్రె ముచ్చు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు చరవాణి అందజేత

**ఖమ్మం, (జనంసాక్షి) :**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం నూతన బస్టాండులో ఓ మహిళా ప్రయాణికు రాలు పోగొట్టుకున్న విలువైన చరవాణిని సిబ్బంది అప్రమత్తంగా గుర్తించి భద్రపరిచారు. అనంతరం విధుల్లో ఉన్న పోలీసు అధికారి కోటా నాగేంద్రరావు సమక్షంలో ఆ మహిళకు ఆమె చరవాణిని ఆర్టీసీ ఏడిసి ఎం రవీంద్రనాథ్ అప్పగించారు. తనకు పోయిన చరవాణి సురక్షితంగా తిరిగి లభించడంతో మహిళా ప్రయాణికురాలు ఆనందం వ్యక్తం చేస్తూ, ఖమ్మం డి ఎం శివప్రసాద్ సహా సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల భద్రతతో పాటు వారి విలువైన వస్తువుల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని అధికారులు తెలిపారు.

# రక్తదానం చాలా గొప్ప దానం -జనచైతన్య ట్రస్ట్

**హుజూర్ నగర్, (జనంసాక్షి):** రక్తదానం అనేది చాలా గొప్ప దానం ఎందుకంటే మనం రక్తాన్ని సృష్టించలేం దానం మాత్రమే చేయగలం అని జనచైతన్య ట్రస్ట్ అధ్యక్షుడు పారా సాయి అన్నారు. పట్టణంలో ఒక ప్రయివేట్ హాస్పిటల్ లో ఒక ఆమెకు రక్తం తక్కువగా ఉండి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం కావాలి అని నిజాం జనచైతన్య ట్రస్ట్ నిర్వాహకులు అయినా పారా.సాయి, పిల్లి.శివశంకర్ లకు సమాచారం ఇవ్వడంతో వెంటనే స్పందించి జనచైతన్య ట్రస్ట్ అధ్యక్షుడు పారా సాయి బి పాజిటివ్ బ్లడ్ గ్రూప్ డోనర్ వల్లపుదాస్ వెంకీ తో మాట్లాడి, రక్తదానం చేపించారు. సోమవారం ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పారా సాయి మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి రెండు, మూడు సార్లు రక్తదానం చేయొచ్చు. మీరు చేస్తున్న రక్తదానం ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుంది. ఈరోజు రక్తదానం చేసిన వల్లపుదాస్ వెంకీ కి ట్రస్ట్ తరుపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య ట్రస్ట్ సభ్యులు పారా సాయి, పిల్లి శివశంకర్, దగ్గుపాటి రమేష్, జయంత్, కాశి విశ్వనాథ్, కె సాయి తదితరులు పాల్గొన్నారు.



# సమ్మర్ క్యాంప్ లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

## మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్

**హుజూర్‌నగర్, (జనంసాక్షి):** విద్యార్థులకు విద్యా సంవత్సరం ముగిసిన అనంతరం లభించే విరామ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేసిందని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం హుజూర్ నగర్ పట్టణంలోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంప్ ను ఎంఈఓ భూక్య సైదా నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సహపాఠ్య అంశాలకు కూడా ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఈ సమ్మర్ క్యాంపు నందు విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడాంశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తర్ఫీదునిస్తారని, క్యాంపుకు హాజరయ్యే వారికి స్నాక్స్ కూడా ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా అందజేస్తారని తెలిపారు. కావున విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొని తమకు ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తాతరాజు శ్రీనివాస్, ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్లు మున్నీ బేగం, పాశం శేఖర్, కామల్ల రాజు పాల్గొన్నారు.




# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల వేడుకలు

**హుజూర్ నగర్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి 99 రోజుల "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి మే 17 వరకు చేపట్టిన విద్యా వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా హుజూర్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ రామారావు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం కళాశాల కరపత్రాలను బ్యానర్ ని విడుదల చేసి విద్యా వారోత్సవాల వేడుకలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రామారావు మాట్లాడుతూ సొరవ్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు వారితో కళాశాల ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులకు అగ్రి, సర్వే, ఫిక్స్ వింగ్ అంశాలలో డ్రోన్స్ ఆపరేటర్స్ గా ట్రైనింగ్ ఇవ్వడం, డ్రోన్ ఆపరేటర్ గా ఉద్యోగం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల బృందం వైస్ ప్రిన్సిపల్ ఎస్ఎస్ సునంద, ఐక్య సి కోఆర్డినేటర్ ఎస్ ప్రియాంక, బీ శ్రీనివాస్, ఎస్ బాలరాజు, డాక్టర్ నాగేష్, బి నాగార్జున, డాక్టర్ జే వెంకటేశ్వర్లు, వి .లక్ష్మీనారాయణ, మాలతి మట్టయ్య, ప్రవీణ్, యోగి, రాధా, స్రవంతి, సైదా నాయక్ పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలకు దారి కల్పించి పునః ప్రారంభించాలి

## యుఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం

**నేరేడుచర్ల ( జనంసాక్షి)** మున్సిపాల్టీ పరిధిలో నర్సయ్యగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు దారి కల్పించి పాఠశాలను పునఃప్రారంభించాలని కోరుతూ యుఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నేరేడుచర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ సింహారెడ్డి మాట్లాడుతూ. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నర్సయ్య గూడెంలో గత ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలకు సరైన దారి లేకపోవడంతో పాఠశాల మూతపడిందని,పాఠశాల మూతపడటంతో అక్కడి చిన్నారులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా ఆ ప్రాంతంలో అంగన్వాడి కేంద్రం కూడా లేకుండా పోయిందని,ప్రస్తుతం అంగన్వాడి టీచర్ తన ఇంటిలోనే కేంద్రాన్ని నిర్వహిస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ ప్రాథమిక విద్య బోధిస్తున్నారని .ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత దారి ఏర్పాటుచేసి పాఠశాలను పునః ప్రారంభించాలని, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



# సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## మండల ప్రత్యేకాధికారి సుభాషిణి

**గుర్రంపోడు , మే 11,(జనంసాక్షి)** మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (టీజీఎంఎస్) లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను జిల్లా ఉద్యానశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి సుభాషిణి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా, ఎండల్లో బయట తిరగకుండా ఉండేందుకు ఈ సమ్మర్ క్యాంప్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు యోగా, చెస్, క్యారంబోర్డ్ వంటి క్రీడలతో పాటు నృత్యాలు, పాటలు, చిత్రలేఖనం మరియు వివిధ నైపుణ్య మెలుకువలను నేర్పిస్తారని ఆమె తెలిపారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్. కరుణశ్రీ, మండల అభివృద్ధి అధికారి జె. మహేష్, సర్పంచ్ జాల యాదయ్య, మండల విద్యాధికారి నోముల యాదగిరి, పాఠశాల ప్రిన్సిపాల్ జి. రాగిణి, సంఘబంధం అధ్యక్షురాలు రేపాక యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



# బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**కోదాడ, (జనం సాక్షి):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనా చర్యలు తీసుకోకపోవడం పట్ల యువజన విభాగం అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూసాధారణ ప్రజలకు ఓ నీతి.. మంత్రి కొడుక్కి మరో నీతి ఉంటుందాఅని ప్రశ్నించారు. బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని విమర్శించారు. ఒక మైనర్ బాలిక మూడు నెలలుగా న్యాయం కోసం పోరాడాల్సి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బాధితురాలు, ఆమె కుటుంబాన్ని నేరస్తుల్లా వేధించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. "బేటీ బచావో" అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బీజేపీ నాయకత్వం,ఇప్పుడు కేంద్ర మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తోందని ఆయన ప్రశ్నించారు. ఒక మైనర్ బాలిక అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు.



# వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** యువత స్వయంకృషితో ఎదిగి ఆదర్శంగా నిలవాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని వినూత్న హాస్పిటల్ సమీపంలో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ఫుడ్ కోర్ట్ ను వారు ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ నాణ్యమైన సేవలను వినియోగదారు లకు అందించి వారి మన్ననలు పొంది వ్యాపారంలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ. అంజద్ అలీ, కౌన్సిలర్ గుణగంటి హేమ సతీష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కక్కిరేని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్,మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, చిలుముల సునీల్ రెడ్డి, కొనతం రాజేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, కేసారం సర్పంచ్ రేఖ రమణ సతీష్, గుంజలూరు సర్పంచ్ బొల్లికొండ సైదులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాచకొండ శ్రీనివాస్, ఇజ్రార్ అహ్మద్, మన్సూర్ అర్ఫ్, దామోదర్ రెడ్డి,నారాయణ ప్రవీణ్ రెడ్డి, నాగు నాయక్, బొల్లెద్దు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

